www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 28 ఆగస్టు 2023
5
అన్నమయ్య

నేడు యథావిధిగా స్పందన

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం - స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

కనుమరుగవుతున్న మగ్గాలు

- చేనేత చీరలకు తగ్గుతోన్న గిరాకీ
- ప్రభుత్వం నుంచి సాయం అంతంత మాత్రమే
- ప్రభుత్వ పథకాలు శూన్యం
- నేత వస్త్రాలను అడిగే నాథుడే కరువు
- పనులు లేక ఉపాధి కూలీలుగా మారుతున్న వైనం

ప్రజాశక్తి - రాయచోటి

నేతలు మారిన చేనేతల తలరాతలు మాత్రం నేటికీ మారలేదు. అగ్గిపెట్టెలో పట్టేలా నాణ్యమైన జరీ చీరను నేసిన ఘనత చేనేత కార్మికులది. అలాంటి చేనేత కార్మికులు నేడు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు వస్త్రాలను తయారు చేస్తున్న చేనేతల బతుకులు మాత్రం మారలేదు. ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఎదురు చూసి మోసపోకుమా అన్న సామెత నిజమవుతోంది. ఎన్నికల ముందు నాయకులు వచ్చి చేనేతలకు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని విధాలా ఆదుకుంటామంటూ మాట ఇచ్చి ఎన్నికల్లో గద్దెనెక్కిన తర్వాత చేనేతల అభివృద్ధికి పట్టించుకున్న పాపాన పోవడం లేదు. గతంలో ఎక్కడ చూసినా చేనేత మగ్గం వాట్లు శబ్దాలతో మారుమోగేది. ఉదయం 5 గంటల నుంచి కొందరు నిద్ర లేచి మగ్గంలో దిగి సద్దన్నం తయారీ కల్లా కొంత పని చేసి అటు తర్వాత కాలకృత్యాలు తీర్చుకొని సంధ్యావందనం చేసుకొని తిరిగి సద్ది అన్నం తిని పనిలో దిగి మధ్యాహ్నం భోజన సమయానికి చీర పూర్తి చేసేవారు. ఇంటిల్లపాది కష్టపడి పని చేస్తే కానీ, నోటి కాడికి ముద్ద వచ్చేది కాదు. కాలక్రమేనా చీరలు అనుకొన్నంత సమయంలో నేయలేక ఉన్నారు. రాను రానూ చేనేత వస్త్రాలకు డిమాండ్ తగ్గింది. ఇది ఇలా ఉంటే గతంలో చేనేత కార్మికులకు నూలు, జలతారు ఇచ్చి, చీరలు నేయించుకుని అందుకు ప్రతిఫలంగా కూలీలు ఇచ్చి వారిని ప్రోత్సహించేవారు. కరెంటు మగ్గాలు రావడంతో చేనేత వస్త్రాల గిరాకీ తగ్గింది. చాలామంది మిల్లు వస్త్రాలకే అలవాటు పడుతున్నారు. దీంతో చేనేత వస్త్రాలకు గతంలో ఎక్కువగా ఇష్టపడి కొనే వారు కూడా మిల్లు వస్త్రాలకు మక్కువ చూపుతున్నారు. దీనికి తోడు మదనపల్లె, రాయచోటి తదితర ప్రాంతాలలో చేనేత వస్త్రాలను నేసే దానిపై ఎక్కువ కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ప్రభుత్వం చేనేత సొసైటీ ఏర్పాటు చేసి ఒక్కొక్క సొసైటీ కింద చేనేత కార్మికులను చేర్చుకొని వారి నేసిన చీరలను కొనుగోలు చేసి వారికి డబ్బులు ఇస్తూ ప్రోత్సహించేవారు. రాను రానూ ప్రభుత్వం నుండి కార్మికులకు ప్రోత్సాహం అందకపోవడంతో చేనేత మగ్గం నేసే వారి సంఖ్య క్రమేపి తగ్గుముఖం పట్టి నేడు మగ్గం నేసే వారి సంఖ్య వేళ్ళపై లెక్కించే స్థాయికి చేరింది. చాలామంది నేత కార్మికులు ప్రోత్సాహం అందక ప్రభుత్వ సాయం లేకపోవడంతో నేత పని ఆపేశారు. ప్రభుత్వం గతంలో కార్మికులకు పనిముట్లు అందజేసేది. ప్రస్తుతం ఇవ్వడం లేదు. పైగా రుణాలు కూడా సక్రమంగా అందడం లేదు. నేతన నేస్తం కింద వచ్చే రూ. 24 వేలు అర్హులకు అందడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిల్లు వస్త్రాలు రావడంతో నేత వస్త్రాలను కొనే వారి సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. ఇది ఇలా ఉంటే చీరలు అమ్మే వారిలోనూ పోటీ భావం నెలకొని ఒకరినొకరు తక్కువ ధరలకే విక్రయిస్తూ వ్యాపారాలను దెబ్బతీసుకుంటున్నారు. నేడు చేనేత చీరలను అమ్మేవారంటేనే కొనేవారు తక్కువ రేటుకు అడగడం చూస్తున్నాం. దీనికి తోడు పట్టణాల్లో వీధికి ఐదు ఆరు చొప్పున వస్త్ర దుకాణాలు రావడంతో చాలా మంది అక్కడికే వెళ్లి చీరలు కొనడంతో చేనేత వస్త్రాలు కొనుగోలు తగ్గిపోయాయి. ఏది ఏమైనప్పటికీ ప్రభుత్వం చేనేతలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 50 ఏళ్లు నిండిన చేనేత కార్మికులకు పింఛను అందిస్తామని హామీ ఇచ్చినా ఆచరణలో విఫ లమైంది. చేనేతలకు గుర్తింపు కార్డులు, పింఛన్లు అందలేదని పలువురు నేతన్నతలు వాపోయారు. .సచి వాలయాల్లో పింఛన్ కోసం దరఖాస్తులు చేసుకున్నప్పటికీ గుర్తింపు కార్డులు ఉంటేనే మంజూరు చేస్తామంటూ సంబంధిత అధికారులు చెప్పడంతో నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు. మూడేళ్లుగా చేనేత గుర్తింపు కార్డులు ఇచ్చిన పాపాన పోలేదు ఇప్పటికైనా అధికారులు స్పందించి గుర్తింపు కార్డులు లేని వారికి వెంటనే గుర్తింపు కార్డులు అందజేసి అర్హులైనచే నేతలందరికీ పింఛన్లు అందించాలని చేనేత కార్మికులు కోరుతున్నారు.

పనిముట్లు ఉచితంగా ఇవ్వాలి

కార్మికులకు పనిముట్లను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాలి. కార్మికులకు గుర్తింపు కార్డులు కూడా అందజేయాలి. చేనేత వస్త్రాలకు గతంలో మాదిరిగా వ్యాపారాలు లేవు. దీంతో పూట గడవడానికి ఇబ్బందిగా ఉంది. చేనేత మగ్గాలపైన ఎక్కువ కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవాలి.

- శిబ్యాల రాంబాబు, గాలివీడు.

ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుంది

చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రుణాలను మంజూరు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ముద్ర ద్వారా రూ. 50 వేల నుంచి లక్ష రూపాయలు వరకు 15 శాతం సబ్సిడీతో రుణాలను రుణాలను మంజూరు చేస్తుంది. ఎవరైనా అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చు. రుణాన్ని పెట్టుబడిగా ఉపయోగించుకోవాలి. కేంద్ర ప్రభుత్వం కస్లర్ ద్వారా చేనేత కార్మికులకు పనిముట్లను కూడా అందజేస్తున్నాం. వైఎస్ఆర్ నేతన్న నేస్తం కూడా రూ. 24 వేలు ప్రతి ఏడాదీ చేనేత కార్మికులకు అందజేస్తున్నాం .

- పి .శ్రీనివాసులు రెడ్డి , జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి , రాయచోటి, అన్నమయ్య జిల్లా.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

జిల్లా ఖజానా శాఖ అధికారి సయ్యద్ మహబూబ్

ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వశాఖలో పంపుతున్న బిల్లులను సకాలంలో పాస్ చేసి ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించి సకాలంలో జీతభత్యాలు అందించడమే తమ లక్ష్యమని జిల్లా ఖజానా శాఖ అధికారి సయ్యద్ మహబూబ్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు ,పెన్షనర్లు ఎంతమంది ఉన్నారు. ఎంతమందికి పెన్షన్ జీతభత్యాలు అందిస్తున్నారో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాల్లో ఖజానా శాఖ కార్యాలయాల వివరాలు తెలపండి?

అన్నమయ్య జిల్లాలో 9 ఖజానా కార్యాలయాలున్నాయి. ఉప ఖజానా కార్యాలయాలు మదనపల్లె, తంబళ్లపల్లె, వాల్మీకిపురం, పీలేరు, రాయచోటి, లక్కిరెడ్డి పల్లి, రాజంపేట , రైల్వేకోడూరులో ఉన్నాయి. జిల్లా ఖజానా కార్యాలయం రాయచోటి జిల్లా కేంద్రంలో ఉంది.

ఖజానా కార్యాలయంలో పనులేమిటి?

ఉద్యోగుల జీతబత్యాలు, వివిధ శాఖలకు బడ్జెట్లో కేటాయించిన నిధుల చెల్లింపులు, ఉద్యోగుల భవిష్య నిధుల చెల్లింపు, అన్ని శాఖల ఉద్యోగుల వివరాలు డేటా బేస్ లో ఫీడ్ చేయిచడం, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ చెల్లింపులు, వివిధ పద్దుల ద్వారా ప్రతి నెలా జరిగిన జమ, ఖర్చు వివరాలు అకౌంటెంట్ జనరల్ వారికి నివేదికలు అందించడం వంటి విధులు నిర్వహిస్తాం.

ప్రభుత్వ ఉద్యోగుల వివరాలు తెలపండి ?

రెగ్యులర్ ఉద్యోగులు 18, 277, సచివాలయ వాలంటీర్లు 8454, పెన్షనర్లు 9,978, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు 956, కాంటాక్ట్ ఉద్యోగులు 11,96 ,మంది ఉద్యోగులు ఉన్నారు.

ట్రెజరీ చెల్లింపుల వివరాలు తెలపండి?

బిల్లులు పాస్ అయిన తరువాత సిఎం ఎంఎస్ ద్వారా ఆర్‌బిఐ పేమెంట్ గేట్వేకు బదలాయించబడి ప్రభుత్వ ప్రాధాన్యతా క్రమంలో చెల్లించబడతాయి. ప్రతినెల జిల్లాలో దాదాపు రూ. 279, 85,34,240 చెల్లించడం జరుగుతుంది.

ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు జరుగుతుందా?

జిల్లాలో ప్రస్తుతం ఉద్యోగాలలో బయోమెట్రిక్ అమలులో ఉంది. హెల్త్ డిపార్ట్మెంట్ బయోమెట్రిక్‌ను పరిశీలించి జీతభత్యాలను వేస్తున్నాం. త్వరలో మిగిలిన డిపార్ట్‌మెంట్‌లోనూ ఒక్కొక్కటిగా బయోమెట్రిక్ పరిశీలించి జీతభత్యాలు వేస్తాం.

సిబ్బంది కొరత ఏమైనా ఉందా ?

కొన్ని ఉపఖజానా కార్యాలయాలలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ మా సిబ్బంది ఎక్కువ సమయం పని చేసి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నారు.

అధిక ధరలకు వ్యతిరేకంగా సమరభేరి : సిపిఎం

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ భారాలతో ప్రజలను దోచుకుతింటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 30 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమరభేరి పేరుతో ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డులో సమర భేరికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం విధిస్తున్న షరతులకు తలొగ్గి రాష్ట్రం ఇష్టం వచ్చినట్లు భారాలు మోపుతోందని అన్నారు. ప్రపంచ బ్యాంకు షరతులను కేంద్రం అమలు చేస్తూ రాష్ట్రాలపైనా రుద్దుతోందని చెప్పారు. రాష్ట్రం కూడా అప్పుల కోసం కేంద్రం విధించిన షరతులన్నీ అమలు చేస్తోందని, దీనివల్ల సామాన్య ప్రజలపై మోయలేని భారాలు పడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా విద్యుత్ ఛార్జీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తోందని వాపోయారు. గతంలో రూ.200 బిల్లు వస్తే ఇప్పుడు రూ.400 వస్తోందని, అంటే బిల్లు 100 శాతం పెరిగిందని ఇంత పెద్దఎత్తున భారాలు పడుతుండటంతో పరిశ్రమలు కూడా మూతబడుతున్నాయని చెప్పారు. ఇవి చాలదన్నట్లు వ్యవసాయ మోటార్లకు, ఇళ్లకు స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. ట్రూఅప్, ఫ్యూయల్ సర్‌ఛార్జి పేరుతో ఎప్పుడో వాడుకున్న విద్యుత్‌కు ఇప్పుడు భారాలు వేస్తున్నారని, అద్దె ఇళ్లలో ఉండే సామాన్యులకు ఇది పెనుభారంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా చేసిన ఆందోళనలను, ఆయన తండ్రి రాజశేఖరరెడ్డి చేసిన దీక్షలను గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే తన సొంత కంపెనీలకే వాటాలు కట్టబెడుతూ దోచుకుంటున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లను అదానీ కంపెనీల నుండి కొనుగోలు చేస్తున్నారని వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలపై ప్రేమ ఉంటే ట్రూఅప్, సర్‌ఛార్జీలను రద్దు చేస్తున్నట్లు విద్యుత్ అమర వీరుల దినోత్సవమైన ఆగస్టు 28న ప్రకటించాలని, భారాలపై ప్రజల ఆగ్రహానికి గురికాకముందే కేంద్రం విధిస్తున్న షరతులను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించాలని డిమాండు చేశారు. అధిక ధరలకు, ప్రజలపై భారాలకు వ్యతిరేకంగా సెప్టెంబరు నాలుగు వరకు జిల్లా వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ నెల 30, 31 తేదీల్లో ప్రచారం, సంతకాల సేకరణ, ఒకటోతేదీన సచివాలయాల్లో వినతిపత్రాలు సమర్పిస్తామని, నాలుగోతేదీన అన్ని మండల కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడతామని పేర్కొన్నారు. ఆలోగా ప్రభుత్వం స్పందించకపోతే ప్రజా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఏ.వెంకటేష్, నాగరాజు, రామకృష్ణ, భాస్కర పాల్గొన్నారు.

కంటి చూపుతో జీవితానికే వెలుగు

మెగా ఉచిత కంటి వైద్య శిబిరంలో డిప్యూటీ సి ఎం అంజాద్‌బాషా

మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం, ఎంపీ, జడ్‌పి చైర్మన్, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కంటి చూపుతో జీవితానికే వెలుగు లభిస్తుందని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా తెలియజేశారు. జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వల్లూరు రామ సుబ్బమ్మ, సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం వల్లూరు మాధవి లత, రమేష్ రెడ్డి కుటుంబ సభ్యులు, రోటరీ క్లబ్ సహకారంతో ఆదివారం అమర్ నాథ్ రెడ్డి ఎస్టేట్‌లో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప ముఖ్యమంత్రి, పార్లమెంటు సభ్యులు మిధున్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా వైసిపి అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఎ మల్లికార్జున రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజాద్‌బాషా మాట్లాడుతూ సర్వేంద్రియానాం నయనం ప్రధానం అని, ప్రతిఒక్కరు కంటి సమస్యలు పట్ల అశ్రద్ధ చూపరాదని అన్నారు. అమర్ నాథ్ రెడ్డి సహకారంతో చెన్నై నగరానికి చెందిన శంకర్ నేత్రాలయ వారి ఆధ్వర్యంలో మెగా వ్యక్తి వైద్య శిబిరం ప్రజల ముంగిటకే వచ్చిందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేయడంలో అమర్నాథ్ రెడ్డి ఎల్లప్పుడు ముం దుంటారని ఆయన సేవలను కొనియాడారు. పేదల కోసం ఉచిత కంటి శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ వైద్య శిబిరానికి రాజంపేట నియోజకవర్గంతో పాటు రైల్వే కోడూరు, రాయచోటి నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని చికిత్స పొందారు. తొమ్మిది రోజులు పాటు ఈ వైద్య శిబిరం కొనసాగుతుందని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అమర్‌నాధరెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి కోరారు. కార్యక్రమంలో వైసిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిర్మూలనే జెవివి లక్ష్యం

- రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్

2వ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

మూఢ నమ్మకాల నిర్మూలనే జెవివి లక్ష్యమని రాష్ట్ర అధ్యక్షులు రాహుల్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని విజ్ఞాన్ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక (జెవివి) 2వ జిల్లా మహా సభను జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్ . రౌఫ్ బాషా అధ్యక్షత వహించారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన రాహుల్ , డాక్టర్ రెడ్డన్న మాట్లాడుతూ సమాజంలో పేరుకుపోయిన మూఢనమ్మకాలను పారద్రోలి ప్రజల్లో సైన్స్ పట్ల అవగాహన కల్పించేందుకు జెవివి కృషి చేస్తోందని చెప్పారు. జెవివి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాలకూ విస్తరింపజేసేందుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ప్రజలలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలని కార్యకర్తలను కోరారు సైన్స్ పర్యావరణం, విద్యా, వైద్యం ఆరోగ్యం సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు. అనంతరం సభలో ఉమర్ బాషా, నాగేశ్వరావుచే మ్యాజిక్ షో, మిమిక్రీ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా జాతీయ పురస్కారానికి ఎంపికైన జెవివి రాయచోటి మండల అధ్యక్షులు ఆంజనేయులను సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రభు చరణ్, జయచంద్ర, వైసి రెడ్డప్పరెడ్డి , లయన్ వ్యవస్థాపక అధ్యక్షులు హరినాధరెడ్డి , రవీంద్రనాథ్‌రెడ్డి , రామయ్య, కళావతి, యూత్ ఐకాన్ వినయ్‌కుమార్, ప్రతాప్ రెడ్డి, శంకరయ్య , సురేంద్ర రాజు, రవి , రాజ శేఖర్, లయన్ చాన్‌బాష , మధుసూదన్ , శ్రీనివాసులు , అసదుల్ల, విద్యార్థులు పాల్గొన్నారు.

19 మందికి కంటి ఆపరేషన్లు

కంటి పరీక్షలుచేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లెలో ఉన్న లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 19 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజవర్గంతో పాటు జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వేకోడూరు, యర్రావారిపాలెం, కేవీపల్లి, కలకడ, కలికిరి, పెద్దమండెం, గుర్రంకొండ, కదిరి, ఎన్.పి.కుంట, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 45 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు అందులో అర్హులైన 19 మందికి ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 38 మంది కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్ కోసం వచ్చిన రోగులతో పాటు వారి వెంట ఉండే వారికి భోజన వసతి కల్పించే నిమిత్తం సత్యసాయి సేవా సమితి సభ్యులు ఉషారాణి , శ్రీదేవి,రేవతి, పద్మావతి తదితరులు రూ.3 వేలు నగదు అందజేయడంతో పాటు రోగులకు అరటి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ బాషా, లయన్ రెడ్డప్పరెడ్డి, కంటి వైద్యులు సురేష్ బాబు, ఆప్తాలిక్ అసిస్టెంట్ మూలీ రాజగోపాల్ రెడ్డి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

యువత విభిన్న రంగాల్లో రాణించడం హర్షణీయం

ఫొటోగ్రఫీ స్టూడియో ప్రారంభోత్సవంలో అతిథులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

యువత విభిన్న రంగాల్లో రాణించడం హర్షణీయమని జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షులు ఎస్. కరీముల్లా పేర్కొన్నారు. పట్టణంలోని పాయి రామన్న వీధిలో ఏర్పాటు చేసిన ఐ బ్రో రైజ్ ఫొటోగ్రఫీ స్టూడియోను ఆదివారం అట్టహాసంగా ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రతి వ్యక్తీ తమ జీవితకాల జ్ఞాపకాలను భద్రపరుచు కునేలా ఐబ్రో రైజ్ ఫొటోగ్రఫీ స్టూడియోను పట్టణంలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా స్టూడియో నిర్వాహకులు వంశీ యాదవ్‌ను అభినందిస్తూ, యువత ప్రాచ్యత్య సంస్కృతిలో ప్రజల అభిరుచుల మేరకు స్వయం ఉపాధి రంగాలలో రాణించడానికి ముందడుగు వేయడం శుభ పరిణామమని పేర్కొన్నారు. మారిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని స్టూడియోను ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రజలంతా ఆదరించి ప్రోత్సహించాలని కోరారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం

ప్రజాశక్తి-కాశినాయన

ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగ సమస్యలు పరిష్క రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర అన్నారు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యార్థి సంగ్రామ స్కూటర్ యాత్ర ఆదివారం మండల కేంద్రమైన నరసాపురానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎపిమోడల్ పాఠశాలలోని హాస్టల్ విద్యార్థులతో వారు మాట్లాడుతూ ఇక్కడ అధ్యాపకుల కొరత ఉందని వెంటనే పోస్టులు భర్తీ చేసి విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం నాంది పలకాలని కోరారు ప్రభుత్వ విద్యా రంగాన్ని పక్కనపెట్టి కార్పొరేట్ విద్యారంగాన్ని ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆ విధానంమానుకోవాలని వారు డిమాండ్ చేశారు. 40 సంవత్సరాల నుండి నర్సాపురంలో ఎస్సీ బాలుర వసతిగృహం అద్దె భవనంలో నడుస్తుందని, అక్కడ వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, కొన్ని కోట్ల ఇన్‌ఛార్జి వార్డెన్లతో ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సునీల్ జిల్లా సహాయ కార్యదర్శి వీర పోగు రవి మండల నాయకులు సందీప్ సుమంత్ రాజశేఖర్‌శేఖర్ పాల్గొన్నారు **బి.కోడూరు :** మండలంలోని సగిలేరు గురుకుల పాఠశాల సమస్యలకు నిలయంగా మారిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సగిలి రాజేంద్రప్రసాద్, గండి సునీల్ పేర్కొన్నారు. విద్యార్థుల సంగ్రామ స్కూటర్ యాత్ర భాగంగా మండల కేంద్రానికి చేరుకుంది. గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సగిలేరు గురుకుల పాఠశాలలో 350 మంది విద్యార్థులు ఉండగా వారికి సరైన సదుపాయాలు కల్పించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పాఠశాలలో విద్యార్థులకు భోజనం సరిగా పెట్టడం లేదని విద్యార్థులు వాపోయారని అన్నారు. మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని విద్యార్థులు తెలిపారని వారు అన్నారు. ఉన్నతాధికారులు ఈ సమస్యను పరిష్కారం చేయకపోతే మండల వ్యాప్తంగా జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

తెలుగుభాష ఊపిరి లాంటిది

ప్రజాశక్తి- కడప అర్బన్

మన తెలుగు భాష మనకు ఊపిరి లాంటిదని ఆంగ్లాన్ని లేదా ఇతర భాషను ఉపాధి కోసం నేర్చుకోవడంలో తప్పులేదని రాష్ట్ర అధికార భాష సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య పేర్కొన్నారు. రాష్ట్ర అధికార భాషా సంఘం ఆధ్వర్యంలో వ్యవహార భాషోద్యమకర్త గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా జిల్లాలో జరుగుతున్న తెలుగు భాషా వికాస ఉత్సవాలలో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ఆధ్వర్యంలో కడప నగరం పాత కలెక్టరేట్‌లో ఇంటాక్ సంస్థ కార్యాలయంలో ఆదివారం తెలుగు భాష వికాస దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మాతృభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రి పైన ఉందని, ప్రతి పౌరుడు బాధ్యతగా మన భాషను భావితరాలకు అందించవలసిన అవసరాన్ని గుర్తు ఎరగాలని సూచించారు. పాఠశాలలో బై లింగ్వల్ పుస్తకాలను ఉపయోగించడంతో ఉపాధ్యాయులకు, ఇటు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు. జిల్లాలో తెలుగు భాష అమలు పోలీసు శాఖలో చాలా బాగా ఉందని పాఠశాలల్లోనే మన భాష పట్ల గౌరవం సన్నగిల్లినట్టు కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సభాధ్యక్షులు ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఇంగ్లీషుతోనే అన్ని లభిస్తాయని భావించడం అవివేకమని, ఉపాధి కోసం ఏ భాష నేర్చుకున్న ఎవరికీ అభ్యంతరం లేదని కానీ మాతృభాషను మరవడం మంచిది కాదన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ తమిళ భాషాభిమానాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. డాక్టర్ కోట మృత్యుంజయరావు మాట్లాడుతూ భాష సంస్కారాన్ని విలువలను ప్రధానంగా సృజన శక్తిని పెంచుతుందని వివరించారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజు మాట్లాడుతూ గిడుగు మాదిరిగా తెలుగు భాషను బతికించేందుకు జీవితాన్ని అర్పించిన బ్రౌన్ మహాశయుని పేరిట తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషిచేసిన వారికి ప్రత్యేకంగా పురస్కారాన్ని ఇస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.

కాలనీలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

జగనన్న కాలనీకి విద్యుత్ సౌకర్యం

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ ఎర్రయ్యగారిపల్లి సమీపంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు సూపర్వైజర్ మల్లికార్జున తెలిపారు. అధికారుల చొరవతో మదనపల్లికి చెందిన కాంట్రాక్టర్ బివి రమణ ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారు. విద్యుత్ సౌకర్యం ఏర్పాటుతో వీధిదీపాలు, ఇల్లకు విద్యుత్తు, బోరు మోటారు, ఏర్పాటు చేయడానికి వీలుంటుందని కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలను యాదవులకు కేటాయించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాజంపేట పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజక వర్గాలలో యాదవులు జనాభా అధికంగా వున్నందున కాంగ్రెస్ పార్టీ రాజంపేట ఎంపీ, ఎమ్మెల్యే స్థానం యాదవులకు కేటాయించాలని ఎపి యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తుర్లు ఆనంద్‌యాదవ్ తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా రాజంపేట ఎంపి స్థానాన్ని గాని, మదనపల్లి అసెంబ్లీ స్థానాన్ని కానీ యాదవులు కేటాయించలేదని తెలిపారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీట పెద్దలు గుర్తిం చాలని సుంచించారు. అన్ని పార్టీలు కూడా యాదవులను అణగద్రొక్కె ప్రయత్నం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి దశలో నడిపిన వ్యక్తులలో రఘువీరారెడ్డి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో వున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో యాదవులు అధిక జనాభా ఉన్నప్పటికీ తగిన పదవులు లభించడం లేదన్నారు. రాజంపేట ఎంపీ స్థానాన్ని, మదనపల్లి అసెంబ్లీ స్థానాన్ని యాదవులకు కేటాయించే విధంగా అదిష్టానానికి సిపార్సు చేయాలని కోరారు.

ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బి.కొత్తకోట పట్టణానికి చెందిన మాలిక్‌ను వైసిపి జిల్లా ఉపాధ్యక్షులుగా పార్టీ అధిష్టానం నియమించిన సందర్భంగా ఆదివారం ఆయన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి జిల్లా పార్టీ కమిటీలో ఉపా ధ్యక్షులుగా పార్టీకి సేవ చేసే అవకాశం కల్పించిన మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డికి, ఎంపీ మిథున్‌రెడ్డికి, ఎమ్మెల్యే ద్వారక నాథ్ ఒడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాపై నమ్మకంతో అప్పగించిన బాధ్యత లను అంకితభావంతో పనిచేసి, పార్టీ విజయం కోసం అహ ర్నిశలు కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నక్క మహేష్, ఉర్దూ స్కూల్ కమిటీ చైర్మన్ ఇబ్రహీం, సాదిక బాషా, మహమ్మద్‌గౌస్, కరీముల్లాలు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన మైనార్టీ నాయకులు

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక మండలంలోని మైనార్టీ యువనాకలు వేంపల్లి బావాజీ తమ బృందంతో ఎంపీ మిధునరెడ్డి కలసి నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మిధున్ రెడ్డితో కలికిరి మండలానికి సంబంధించి 18 ఎకరాలతో ఏర్పాటు చేయాల్సిన నూతన జగనన్న కాలనీకి సంబంధించిన సమస్యలపై పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. అంతేకాకుండా గతంలో జరిగినటువంటి అభివృద్ధి కార్యక్రమాలపై వివరణ ఇచ్చినట్లు తెలిపారు. ఎంపీ. మిథున్ రెడ్డి స్పందిస్తూ తప్పకుండా త్వరలో మీ సమస్యలు పరిష్కారం చేసి జగనన్న కాలనీకి దోహదపడతామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాకీర్ మునీర్ సల్మాన్ మధు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వెంకటేష్

ప్రజాశక్తి-పీలేరు

గండికోట వెంకటేష్

మహాజన సోషలిస్ట్ పార్టీ నిర్మాణంలో భాగంగా పీలేరు నియోజకవర్గం ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు గండికోట వెంకటేష్‌ను ఎంఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వైకె విశ్వనాథ్ మాదిగ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు, మండల నాయకులు బాధ్యులు వెంకటేష్ కు సహకరించి, సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ మహాజననేత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, ఎంఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వైకె విశ్వనాథ్ మాదిగ సూచనలతో సామాజిక, ఆర్థిక, రాజకీయ, నాయకత్వం సాధించడానికి అన్ని వర్గాలను సమన్వయ పరుచుకుంటూ కట్టుబడి పనిచేస్తానన్నారు.

మంగళసూత్రాన్ని అందిస్తున్న ఎంపిపి ముద్దాబాబుల్‌రెడ్డి

వివాహానికి మంగళసూత్రం వితరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అనంతసముద్రం పంచాయతీ పెద్దూరు దళితవాడకు చెందిన ఎంబలూరు శీను, శారదమ్మల కుమారుని వివాహానికి ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి, ఆయన సతీమణి పెద్ద విజయమ్మ ఆధ్వర్యంలో మంగళసూత్రాన్ని అందించారు. ఎంపిపి మాట్లాడుతూ తమ కుటుంబం ఆనవాయితీగా ఇచ్చే పద్ధతిలో భాగంగానే మంగళసూత్రాన్ని అందించామని తెలిపారు. పేదవారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలిపారు.

నేడు బద్వేలులో భూమి కోసం సదస్సు

ప్రజాశక్తి - చాపాడు

బద్వేల్ ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సోమవారం వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో భూమి కోసం నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం మైదుకూరు మండల నాయకులు రాయప్ప, భీముడు కోరారు. ఆ మేరకు వారు ఆదివారం జివి సత్రం గ్రామంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు, పేదలకు ఇంటి స్థలాలు, భూములు మంజూరు చేయాలన్నారు. లబ్ధిదారులకు అసైన్డ్ మెంట్ ద్వారా పట్టాలు పంపిణీ చేయాలన్నారు. అన్నిరకాల ప్రభుత్వ సౌకర్యాలు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : 'బత్యాల'

ప్రజాశక్తి-సుండుపల్లి

టిడిపితోనే పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మాచిరెడ్డిగారిపల్లి గ్రామపంచాయతీలో టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్ళి టిడిపి అధికారంలోకి వచ్చే చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. చంద్రబాబు ప్రకటించిన మహాశక్తి పథకం ద్వారా మహిళలకు సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు, 18 ఏళ్ల నిండిన మహిళలకు నెలకు రూ.1500లు, పిల్లలలకు చదువులకు ఏడాదికి రూ.15వేలు అందిస్తారని చెప్పారు. ప్రస్తుత వైసిపి పాలనపై జనం విసిగి పోయారని అన్నారు. నిత్యావ సరధరలు, పెట్రోలు, డీజిల్ ధరలను విపరీతంగా పెంచి పేద, మధ్యతరగతి ప్రజలనడ్డి విరిచారని అన్నారు. విద్యుత్ ఛార్జీలను అమాం తంగా పెంచి మరింత భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలని కోరారు. రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబుముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉంద న్నారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్ నాయుడు, ఆనంద్‌నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న బత్యాల చెంగల్‌రాయుడు

ఆత్మీయ సహకారంతో మానవత బలోపేతం

మొక్కలు నాటుతున్న మానవత సభ్యులు

ప్రజాశక్తి -చిట్వేలి

సభ్యులకు ఆత్మీయ సహకారం అందించినప్పుడే మానవత బలోపేతం చెందుతుందని మానవత చిట్వేలి శాఖ సలహాదారులు, ఉపసర్పంచ్ ఉమామహేశ్వం రెడ్డి, చైర్మన్ చోడవరం సురేంద్రరెడ్డి, అధ్యక్షులు సాయిరాంలు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం మానవత నెలవారి సమావేశాన్ని సాయివికాస్ పాఠశాలలో నిర్వహించారు. మానవత ప్రధాన ఎజెండాలో ఒకటైన పర్యావరణ పరిరక్షణ భాగంగా పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ సమాజసేవా కార్యక్రమాలను విస్తృతంచేయాలని మానవతసంస్థ బాధ్యులు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. సభ్యత్వాలనమోదుపై సమీక్షించారు. కార్యక్రమంలో మానవత సభ్యులు సురేంద్రరెడ్డి, అధ్యక్షులుసాయిరాం, కార్యదర్శిమునిరావు, ఉమామహేశ్వర్ రెడ్డి, వీరాంజనేయరాజు, విశ్వనాథం, శ్రీనివాసులు, మణి, సుధీర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, మోహన్, సుబ్బరాజు, రియాజ్, హరి, సభ్యులు పాల్గొన్నారు.

వర్షం కోసం రైతుల ఎదురుచూపు

సగటు వర్షపాతం కూడా నమోదుకాని పరిస్థితి-రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - చాపాడు

ఆగస్టు నెల పూర్తి కావస్తున్న పదును వర్షం పడలలేదు. ఇప్పటికే ఖరీఫ్ సాగులో రైతులు ఎంతో బిజీగా ఉండాల్సింది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. మండల పరిధిలో వరి పంట సాగు చేయాలనుకునే రైతులు ముందస్తుగా పచ్చి రొట్ట ఎరువుగా జీలగ, జనుము సాగు చేశారు. అయితే భూమి సరిగా పదును కాక పోవడంతో జీలగ సాగు ఆశాజనకంగా లేదని రైతులు వాపోతున్నారు. రైతులు సాగు చేపట్టిన పసుపు పంట వర్షాలు సరిగా లేకపోవడంతో ఆశాజనకంగా లేదు. బోర్ బావులు, కుందు తీర ప్రాంతాల్లోని రైతులు కొంతమంది పసుపు, వరి సాగు చేపట్టారు. కేసీ కెనాల్ కాలువ కింద పసుపు సాగు చేపట్టిన రైతులు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటివరకు సుమారైన వర్షం కూడా పడకపోవడంతో భూమి పదును ఎక్కలేదు. మండల పరిధిలో ఈ ఏడాది ప్రారంభం నుంచి పడిన వర్షపాతాన్ని గమనిస్తే జనవరి నెలలో సాధారణంగా 2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాలి.. అయితే నీటి బొట్టు పడలేదు. ఫిబ్రవరి నెల పరిస్థితి కూడా అంతే. మార్చిలో మాత్రం నాలుగు మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 90.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత ఏప్రిల్ నెలలో 16 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా చినుకు రాలేదు. మే నెలలో 2.6 మిల్లీమీటర్లు, జూన్‌లో 37.6 మిల్లీమీటర్లు, ప్రస్తుతం జులై నెలల ఏడు మిల్లీమీటర్లు నమోదైంది. సగటున ఈ ఎనిమిది నెలల కాలంలో 2వందల మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 100 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. మండల పరిధిలో కేసీ కెనాల్, కుందూ నదుల కింద సుమారుగా 23 వేల ఎకరాల్లో వరి, పసుపు ఇతర పంటల సాగు అవుతాయి. అయితే కేసీ కెనాల్‌కు నీరు విడుదల కావాలంటే ఎగువ ప్రాంతాల్లో వర్షం అధికంగా పడాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆల్మట్టి, తుంగభద్ర, శ్రీశైలం జలాశయాల్లో నీటి మట్టాలు నామమాత్రంగా ఉన్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు ఇంకా కొద్ది మేరకు పెరిగినట్లయితే అక్కడినుండి మన జలాశయాల్లోకి నీరు వచ్చే అవకాశాలు ఉంటాయి. రాయలసీమలో మాత్రం అనుకున్న మేరకు వర్షాలు లేకపోవడంతో రైతులు పంటల సాగు సకాలంలో చేపట్టే పరిస్థితి కనబడడం లేదు. జలాశయాల్లోకి తగిన నీరు వస్తే తప్ప పంటల సాగు అయ్యే సూచనలు కనపడడం లేదు. మెట్ట ప్రాంతాల్లో మాత్రం రైతులు పంట సాగు కోసం ఆశలు వదులుకున్నారు. ప్రాజెక్టులకు పూర్తిస్థాయిలో మీరు వస్తే తప్ప కాలువల కింద పంటల సాగు జరిగే అవకాశం ఉండదు గత ఏడాది వర్షాలు సకాలంలో పడడంతో కేసీ కాలువకు ఆగస్టు 11న నీరు విడుదలైంది. దీంతో వరిసాగు 15వేల ఎకరాల్లో సాగైంది. ఈ ప్రభావం దిగుబడిపై చాలావరకు కనపడింది. ఈ ఏడాది కూడా వర్షాలు సకాలంలో పడకపోతే పూర్తిస్థాయిలో సాగు అనుమానమే.

సిద్దారెడ్డిపల్లె వద్ద బీడుగా దర్శనమిస్తున్న పొలాలు

భారత రాజ్యాంగంపై బిజెపి విద్వేషం

ప్రజాశక్తి - కడప

భారత పార్లమెంటరీ వ్యవస్థకు అత్యంత ప్రాణాధారమైన, గౌరవప్రదమైన భారత రాజా ్యంగంపై భారతీయ జన తా పార్టీ విద్వేషం వెళ్లగక్కుతోందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగపు ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం పై ఇటీవల రాజ్యసభలో ఓ బిల్లుకు సంబంధించిన చర్చ సందర్భంగా బిజెపి ఎంపీ, మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గోగోయ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణం సక్రమంగా లేదని, దీనిపై సందేహాలు ఉన్నాయని, అందువల్ల భారత రాజ్యాంగం పై చర్చించాల్సిన అవసరం ఉందని విద్వేషపూరిత ప్రసంగం చేశా రన్నారు. 2014వరకు సమర్థవంతంగా భారత రాజ్యాంగం అమలు చేయగా, తొమ్మిదేళ్ల కాలంలో బిజెపి నాయకులు, ఆ పార్టీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నారని విమ ర్శించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ , దాని మూక సంస్థ ఆర్‌ఎస్‌ఎస్‌కు ప్రజలు సమాధి కడతారని హెచ్చరించారు. సమావేశంలో కడప మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ ఎం. రహమతుల్లా ఖాన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కదిరి ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అలీఖాన్

ఆలయ పునర్నిర్మాణానికి రూ.50 వేలు వితరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని మార్కెట్ యార్డ్ సమీపంలో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయం నిర్మాణానికి మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గోటూరు చిన్నప్ప రూ.50 వేలు ఆదివారం దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ చిన్నప్పను, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సర్వోత్తమ్‌రెడ్డిని పూలహారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ పుననిర్మాణానికి చైర్మన్ చిన్నప్పను అడగగానే రూ.50 వేలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. చైర్మన్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పనులు చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కొండారెడ్డి, నాగరాజు, రఘునాథరెడ్డి, హాజార్, సిద్దయ్య పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల నియోజకవర్గంలోని చెరువులను వెంటనే నింపి రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి కోరారు. స్థానిక వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఖరీఫ్ కింద కొంతమంది రైతులు పంటలను సాగు చేశారన్నారు. వర్షం రాక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. చిత్రావతి, పైడిపాలెం రిజర్వాయర్లలో నీరు పుష్కలంగా ఉన్నందున వాటి ద్వారా చెరువులకు నీరు నింపితే రైతులు వారి పంటలను కాపాడుకుంటారన్నారు. అలాగే పంటలు వేయకుండా బీడు పెట్టుకున్న రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు విస్తరణ, ప్రభుత్వ అవసరాల కోసం నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలన్నారు. రైతులను ఏ విధంగా ఆదుకుంటారో చెప్పాల్సిన బాధ్యత అధికార పార్టీకి ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తుగుట్ల రాఘవరెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపిని బలోపేతం చేయండి

చక్రాయపేట : పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట మండలంలో టిడిపిని బలోపేతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ, ఇన్‌ఛార్జి బీటెక్ రవి కోరారు. మండలంలోని సురభి గ్రామం నాగలగట్టపల్లెలో ఆదివారం మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రతి కార్యకర్త తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని, మీకు తాను అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు. ఏదేమైనప్పటికీ చక్రాపేట మండలంలో సురభి గ్రామం అర్ధమండలమని సురభి గ్రామంలో పార్టీని బలోపేతం చేస్తే చక్రాపేట మండలంలోనే కాదు పులివెందుల నియోజ కవర్గంలో కూడా పార్టీ పుంజుకుంటుందన్నారు.

ఘర్షణలకు పాల్పడవద్దు : ఎస్ఐ

ప్రజాశక్తి - చాపాడు

ఏవైనా సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని, ఘర్షణలకు పాల్పడవద్దని ఎస్ఐ మైనద్దీన్ సూచించారు. మండల పరిధిలోని చిన్నవరదాయపల్లి గ్రామంలో ఆదివారం ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు నాకా బందీ నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలోని అను మానితుల ఇళ్లు, ఖాళీ ప్రదేశాలు, గడ్డివాములలో సోదాలు నిర్వహించామని ఎస్ఐ తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

గడ్డివాముల్లో సోదా చేస్తున్న పోలీసులు

సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ముగిసిన ఎన్‌సిసి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి -చిట్వేలి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సిసి ట్రూప్ కమాన్‌డెంట్ పసుపుల రాజశేఖర్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా పాఠశాల ఆవరణంలో జరుగుతున్న ఎన్‌సిసి విద్యార్థుల శిక్షణ ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలపై ఎన్‌సిసి అధికారి పసుపుల రాజశేఖర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కేవలం అందం, దుస్తుల బట్టి వ్యక్తిత్వాన్ని అంచనా వేయకూడదని, సమయం, సందర్భం, వ్యక్తులను బట్టి మాట్లాడే విధానం, నిలబడే విధానం, అభిప్రాయాలను వ్యక్తపరిచే విధానం, ఆలోచించే విధానం, నాయకత్వ లక్షణాల మెలుకవలను విద్యార్థి దశ నుండే నేర్చుకునే అవకాశం రావడం అదృష్టమన్నారు. కార్యక్రమంలో హవల్దార్లు ప్రకాష్ ప్రమోద్, ఉపాధ్యాయులు చంద్రయ్య, దుర్గరాజు, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజలపై విద్యుత్ ఛార్జీల బాదుడు

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యుత్ ఛార్జీల పెంపుతో రాష్ట్ర ప్రజలపై మోయలేని భారాన్ని వేసి బాదుడు రెడ్డిగా జగన్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కరెంట్ తీగ పట్టుకుంటే షాక్ కొట్టడం సహజమని, వైసిపి పాలనలో కరెంట్ బిల్లు ముట్టుకుంటే షాక్ కొట్టే పరిస్థితి దాపురించిందన్నారు. వైసిపి అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలు పెంచకుండా తగ్గిస్తామని చెప్పిన జగన్‌రెడ్డి మాట తప్పి మడమ తిప్పారని మండిపడ్డారు. నాలుగున్నర సంవత్సరాల వైసిపి పాలనలో 8 సార్లు కరెంటు ఛార్జీలు పెంచారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ళకు, వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై అదనపు ఆర్థికభారం మోపుతున్నట్లు చెప్పారు. సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.11,270 కోట్లు ఆర్థికభారం వేస్తున్నట్లు తెలిపారు. ఏరు దాటినంత వరకు ఓడ మల్లన్న దాటాక బోడి మల్లన్న అన్నట్లుంది జగన్ వాలకమని విమర్శించారు. రాబోవు ఎన్నికల్లో ప్రజలు వైసిపికి రివర్స్ షాక్ ఇవ్వడం జరుగుతుందని తులసిరెడ్డి హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రహ్మణ్యం, ధృవకుమార్‌రెడ్డి, రామకృష్ణ, నరసింహారెడ్డి, ఉత్తన్న, బద్రీ, రాఘవయ్య, శివ, వినయ్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన బిజెపి నేత

ప్రజాశక్తి - వేంపల్లె

బిజెపి పులివెందుల అసెంబ్లీ మాజీ ఇన్‌ఛార్జి డాక్టర్ డివి సుబ్బారెడ్డి టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర పార్టీ కార్యాలయంలో చంద్రబాబును టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ డివి సుబ్బారెడ్డి శనివారం రాత్రి కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబు టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.కార్యక్రమంలో మండల కన్వీనర్ రామమునిరెడ్డి, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, రైతు విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు జగన్నాథరెడ్డి, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, బాలకృష్ణారెడ్డి, మహమ్మద్ ఇనాయతుల్లా, డక్కా రమేష్, గోగుల మారుతి, టివి శ్రీనివాసులు, జబిబుల్లా, వేమా నారాయణ పాల్గొన్నారు.

ఎల్లవేళలా అందుబాటులో ఉంటా

మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి

కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కలకడ

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారికి సేవ చేయడమే నా అదృష్టంగా భావిస్తానని మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రాలను కలకడ లోని పలువురి నాయకులను కలిశారు. మండలంలోని బాటవారి పల్లి పంచాయతీలో సీనియర్ రాజకీయ నాయకులు చంద్రశేఖర్ గతంలో మృతి చెందిన పై ఆయన మృతికి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించారు. టిడిపి నాయకులు షబ్బీర్ అహ్మద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కదిరాయ చెరువులో ఉన్న సింగల్ విండో మాజీ చైర్మన్ మల్లికార్జున శెట్టి కుటుంబాన్ని పరామర్శించే అక్కడనుంచి నడమిచర్లకు వెళ్లి సీనియర్ రాజకీయ నాయకులు నాగమోహన్‌రెడ్డిని కలిసి పరామర్శించారు

అధికారుల అలసత్వాన్ని నిరసిస్తూ నేడు ధర్నా

ప్రొద్దుటూరు : ఇళ్ల కాలనీల్లో కనీస వసతుల కల్పనలో అధికారుల అలసత్వాన్ని నిరసిస్తూ సోమవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిం చను న్నట్లు సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎదలకు గృహ నిర్మాణానికి 2008, 2018లో ఇంటి స్థలాలిచ్చి వాటికి కనీస వసతులు కల్పిచడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. దాదాపు రెండువేల మంది సొంత డబ్బు ఖర్చు చేసి బేస్ మట్టాలు వేసుకున్నారని, అవి శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి-చిట్వేలు

హత్యకు గురైన మునిక్రిష్ణారెడ్డి

మండలపరిధిలోని కెఎస్ అగ్రహారంలో ఈశ్వరీదేవి ఆశ్రమం వద్ద బిక్కిరెడ్డి మునికృష్ణారెడ్డి అనే వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు గొంతు కోసి దారుణంగా హత్య చేశారు. విషయం తెలుసుకున్న రైల్వేకోడూరు సిఐ మధుసూదన్‌రెడ్డి, ఓబులవారిపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, చిట్వేలి ఎఎస్ఐ వెంగయ్య సిబ్బందితో కలసి సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌తో సంఘటస్థలాన్ని క్షుణంగా పరిశీలించి రక్త నమూనాలను సేకరించినట్లు తెలిపారు. హతుడు కృష్ణారెడ్డికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలుఉన్నారని అన్నారు. మృతదేహాన్ని శపరీక్ష నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను త్వరగా పట్టుకుంటామని చెప్పారు.